క్లుప్తంగా

కనుల పండువగా శ్రీ విజయలక్ష్మీ కల్యాణం



పాత గుంటూరు: అరండల్‌పేట 4వ లైనులోని శ్రీ అష్టలక్ష్మీ సమేత లక్ష్మీ నారాయణస్వామి దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం విజయలక్ష్మీ నారాయణుల కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు మర్రిపాటి ప్రసాద్ బృందం ఆధ్వర్యంలో శ్రీచక్ర అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కల్యాణం సందర్భంగా గణపతి పూజ, పుణ్యాహవచనం, కలశ స్థాపన , రక్షాధారణ, నవగ్రహారాధన, ప్రవర, సుముహూర్తం, మాంగల్య పూజ, పుష్పాభిషేకం, కుంకుమపూజ వంటి అనేక కార్యక్రమాల్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహా హారతి, మంత్రపుష్పం అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

జస్టిస్ సోమయాజులును కలిసిన బార్ అసోసియేషన్ నేతలు



గుంటూరు లీగల్: గుంటూరు జిల్లా పోర్ట్‌పోలియో జడ్జిగా ఇటీవల నియమితులైన హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వై.సోమయాజులును గుంటూరు బార్ అసోసియేషన్ మాజీ ప్రెసిడెంట్ పోలూరి వెంకటరెడ్డి, బార్ కౌన్సిల్ మెంబర్ వట్టిజొన్నల బ్రహ్మారెడ్డి ఆదివారం విశాఖపట్నంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గుంటూరు జిల్లా కోర్టు ప్రాంగణంలో ఇండోర్ స్టేడియం, జిమ్ము ఏర్పాటుకు సహకరించాలని కోరగా, జస్టిస్ వై.సోమయాజులు సానుకూలంగా స్పందించారు. అనంతరం ఆయన్ను శాలువాతో సత్కరించారు.

నేడు నగరపాలక సంస్థలో స్పందన

నెహ్రూనగర్: స్థానిక సమస్యలపై ప్రజల నుంచి అర్జీలు స్వీకరించే స్పందన కార్యక్రమాన్ని సోమవారం ఉదయం 10 గంటల నుంచి 1 గంట వరకు నగరపాలక సంస్థ కాన్ఫరెన్స్ హాలులో నిర్వహిస్తున్నట్లు నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. సచివాలయాల్లోనూ ప్రతి రోజూ మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు స్పందన జరుగుతుందని, అక్కడ పరిష్కారం కాని సమస్యలపై నేరుగా తమకు అర్జీలు అందజేయవచ్చని ఆమె సూచించారు.

ఐడియా 2కే వాక్‌కు స్పందన



గుంటూరు వెస్ట్: జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఐడియా ఆధ్వర్యంలో ఆదివారం 2కే వాక్ నిర్వహించారు. స్థానిక ఎన్టీఆర్ స్టేడియం నుంచి మదర్ థెరిస్సా విగ్రహం వరకు నడక కొనసాగింది. కార్యక్రమంలో ఐడియా అంబాసిడర్ కొమ్మా వీరు, డాక్టర్ రత్నాకర్, శాంతి కుమార్, జగదీష్ పాల్గొన్నారు.

పలు ప్రాంతాల్లో లాలాపేట పోలీసుల తనిఖీలు



పట్నంబజారు: లాలాపేట పోలీసుస్టేషన్ పరిధిలో ఆదివారం పలు సమస్యాత్మక ప్రాంతాల్లో పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. గంజాయి, మద్యం సేవిస్తున్నారనే అనుమానాలున్న ప్రాంతాల్ని లాలాపేట పీఎస్ ఎస్‌హెచ్‌వో ఎం. సుబ్బారావు, సిబ్బంది పరిశీలించారు. స్టేషన్ పరిధిలోని పీకలవాగు, మోతీలాల్ కంపెనీ, ఏటుకూరు రోడ్డు, దర్గా మాన్యం, నల్లచెరువు ప్రాంతాలతో పాటు పలుచోట్ల తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌హెచ్‌వో సుబ్బారావు మాట్లాడుతూ అనుమానిత ప్రాంతాల్లో నిత్యం గస్తీ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా సిబ్బందికి పలు సూచనలు చేస్తున్నట్లు వివరించారు.

అష్టమ వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం

పాత గుంటూరు: నందివెలుగు రోడ్డు వస్తనగర్‌లోని శ్రీ పద్మావతి గోదాదేవి సమేత కామ్యసిద్ధి వేంకటాచలస్వామి అష్టమ వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం ఆలయ అధ్యక్షుడు బూసిరెడ్డి మల్లేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. అంకురార్పణ, గురుప్రార్థన, విష్వక్సేనపూజ, దీక్షాధారణ, రుత్విగ్వరణ, వాస్తు పూజ, అగ్నిప్రతిష్ఠాపన, గరుడ ప్రతిష్ఠ తదితర పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం విశేష సంఖ్యలో పాల్గొన్న భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

ఆధునిక వైద్యంతో నవ్వుకు నగిషీలు

- నవ్వేద్దాం హాయిగా... అందంగా...
- దంత వైద్యంలో ఆధునిక పద్ధతులు
- నేడు జాతీయ దంత వైద్యుల దినోత్సవం



దంత వైద్యుల దినోత్సవం పోస్టర్స్

గుంటూరు మెడికల్: మనిషి జీవించాలంటే గాలి, నీరు తరువాత ఆహారం తప్పనిసరి. దాన్ని నోటి ద్వారా దంతాలతో నమిలి తీసుకుంటాం. ఆహారం తీసుకునేందుకు దంతాలు సహకరించకపోతే ఆ బాధ వర్ణనాతీతం. వర్ణించడం కష్టం. ఆధునిక జీవన శైలికి అలవాటు పడిన నేటి ప్రజలు.. ముఖ్యంగా నగర ప్రజలు దంత సమస్యల్ని ఎదుర్కొంటున్నారు. ఆహారపు అలవాట్లు సక్రమంగా లేకపోవడం, కొద్దిపాటి సమస్య ఉన్నప్పుడు పట్టించుకోకపోవడంతో దంత సమస్యలు పెద్దవిగా మారుతున్నాయి. జనాభాలో నూటికి 90 శాతం తమ జీవిత కాలంలో ఏదో ఒక సమయంలో దంత సమస్య బారిన పడుతుంటారు. దంత సమస్యలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రతి ఏడాది మార్చి 6న జాతీయ దంత వైద్యుల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా 'సాక్షి' అందిస్తున్న ప్రత్యేక కథనం.

అందుబాటులో కాస్మోటిక్ వైద్య పద్ధతులు

ఒకప్పుడు పన్ను పుచ్చిపోతే పీకి వేయడం తప్ప, వేరే ఆలోచన ఉండేది కాదు. నేడు దంత వైద్య శాస్త్రం (డెంటిస్ట్రీ) బాగా అభివృద్ధి చెందడంతో పూర్తిగా పాడైన పళ్లను పీకే పని లేకుండా మరమ్మతులు చేసి సాధారణ దంతంలాగా తయారు చేస్తున్నారు. నేడు పన్ను పీక కుండా రూట్ కెనాల్ చికిత్స అందుబాటులో ఉంది. పుచ్చిపోయిన పంటిని శుభ్రం చేసి అందులో సిమెంట్, సిల్వర్ మెటల్‌ను పెట్టి నొప్పిని తగ్గించే విధానం అందుబాటులో ఉంది. పాచి, గారపట్టిన పళ్లను స్కేలింగ్ ద్వారా శుభ్రం చేస్తున్నారు. కదిలిన, అరిగిన పళ్లకు, చిగుళ్ల సమస్యకు ఫ్లాప్ సర్జరీ, పళ్లు ఊడిపోయిన వారికి ఇంప్లాంట్స్ సహాయంతో ఫిక్స్‌డ్ పళ్లు ఏర్పాటు చేస్తున్నారు. షుగర్‌వల్ల దంతాలు ఊడిపోతున్న వారికి బేసల్ ఇంప్లాంట్స్ ద్వారా ఫిక్స్‌డ్ పళ్లు, ఎత్తు, వంకర పళ్లు ఉన్నవారికి కాస్మోటిక్ బ్రైసెస్‌తో ఆర్థో ట్రీట్‌మెంట్ సేవలు అందుబాటులో ఉన్నాయి. చిన్న పిల్లలకు పళ్లు పుచ్చిపోకుండా, ఎగుడుదిగుడులా లేకుండా పళ్ల వరుస అందంగా ఉండేలా పిడోడాంటిక్ ట్రీట్‌మెంట్ నేడు మార్కెట్‌లో అందుబాటులో ఉంది. సాధారణ చికిత్సల మాదిరిగా దంత వైద్యంలో సైతం కాస్మోటిక్ వైద్య సేవలు అందుబాటులోకి రావడంతో ముఖారవిందం పాడవకుండా చిరునవ్వులు చెరిగిపోకుండా దంతాల్ని అందంగా అమర్చుతున్నారు.

జీజీహెచ్‌లో ఉచిత వైద్యం

గుంటూరు జీజీహెచ్‌కు ప్రతిరోజూ 40 నుంచి 50 మంది వివిధ రకాల దంత సమస్యలతో వస్తున్నారు. పుచ్చిపోయిన దంతాల్ని సిమెంట్‌తో ఫిల్ చేయడం, బాగా పుచ్చిపోయిన వాటిని కొద్దిపాటి మత్తు ఇచ్చి పీకివేయడం, గారపట్టిన వాటిని క్లీనింగ్ చేస్తున్నారు. స్పెషాలిటీ వైద్యనిపుణులు అందుబాటులో ఉండటంతో అత్యాధునిక దంత శస్త్రచికిత్సలు సైతం ఉచితంగా చేస్తున్నారు.

జిల్లాలో 600 మంది దంత వైద్యుల సేవలు



ఒకప్పుడు దంత వైద్యుడి వద్దకు వెళ్లకుండా ఇళ్లలోనే వైద్యం చేసుకునేవారు. నేడు ప్రజలకు కొంత మేరకు అవగాహన పెరిగింది. గుంటూరు జిల్లాలో 600 మంది వైద్యులు ఉండగా, గుంటూరు నగరంలోనే 110 మంది దాకా ఉన్నారు. దంత వైద్యంలో కాస్మోటిక్ సేవలు రావడం, ప్రజలకు కూడా అవగాహన పెరగడంతో దంత వైద్యులకు బాగా డిమాండ్ పెరిగింది. ఒక్కో వైద్యుడు ప్రతిరోజూ 15 నుంచి 20 మందికి వైద్య సేవలు అందిస్తున్నారు.

– డాక్టర్ తాళ్ల హర్షవర్ధన్‌రెడ్డి,
దంత వైద్యుల సంఘం జిల్లా సెక్రటరీ

దంత సమస్యలపై అవగాహన అవసరం



ప్రతి ఒక్కరూ దంత సమస్యలపై అవగాహన కలిగి ఉండాలి. ప్రాథమిక దశలోనే వైద్యుల్ని సంప్రదించడం ద్వారా పన్ను పూర్తిగా పాడవ్వకుండా వైద్యం అందించవచ్చు. పిల్లలకు తరచుగా దంత సమస్యలు వస్తుంటాయి. వాటిని తల్లిదండ్రులు గమనించి వైద్యుల్ని సంప్రదించాలి. ప్రతి ఆరు నెలలకు ఒకసారి తప్పనిసరిగా టూత్ బ్రష్‌ను మార్చాలి. ప్రతి రోజూ రెండు పూటలా దంతాలు శుభ్రం చేసుకోవాలి. ఏదైనా ఆహారం తిన్న వెంటనే నోటిలో నీరు పుక్కిలించాలి.

డాక్టర్ రేపూరి లక్ష్మి,
దంత వైద్య నిపుణురాలు, గుంటూరు

భావి జీవితానికి పదో తరగతి ఎంతో కీలకం



పదో తరగతి విద్యార్థులతో విష్ణువర్ధన్, వరప్రసాదరావు, కృష్ణవేణి, పద్మజ

గుంటూరు ఎడ్యుకేషన్: భావి జీవితానికి తొలిమెట్టు వంటి పదో తరగతి విద్యార్థి దశను అధిగమించి, విద్యార్థులు ఉన్నత విద్యావంతులుగా ఎదగాలని శ్రీపాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్ఈ స్కూలు కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ సూచించారు. లక్ష్మీపురం మెయిన్‌రోడ్డులోని సీతారామయ్య స్కూలులో ఆదివారం టెన్త్ విద్యార్థులకు వీడ్కోలు పలుకుతూ తొమ్మిదో తరగతి విద్యార్థులు ఫేర్‌వెల్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా విష్ణువర్ధన్ మాట్లాడుతూ 60 ఏళ్ల ఘన చరిత్ర కలిగిన శ్రీపాటిబండ్ల సీతారామయ్య పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన బోధనతో పాటు వారి సమగ్రాభివృద్ధికి ప్రోత్సాహాన్ని అందిస్తున్నామని చెప్పారు. విద్యార్థి, ఉపాధ్యాయుల మధ్య గురుశిష్యుల సంబంధాలకు పెద్దపీట వేస్తూ, క్రమశిక్షణకు అధిక ప్రాధాన్యత నిస్తూ విద్యార్థుల్ని భావి భారత పౌరులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో పాఠశాల పాలకవర్గ సభ్యుడు గింజుపల్లి వరప్రసాదరావు, అకడమిక్ డైరెక్టర్ లేళ్ల కృష్ణవేణి, ప్రిన్సిపాల్ జె. పద్మజ, వైస్ ప్రిన్సిపాల్ తేజస్వి, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న ముగ్గురిపై కేసు నమోదు

గుంటూరు ఈస్ట్: వేర్వేరు చోట్ల గంజాయి విక్రయిస్తున్న ముగ్గురిపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. శ్రీనివాసరావుపేటలో గంజాయి విక్రయిస్తున్నారన్న సమాచారం అందుకున్న పోలీసులు ఆదివారం దాడి చేసి, కరీముల్లా, నాగూర్‌బీలను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. వారి వద్ద నుంచి 1.5 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. వడ్డెర గూడెంలో బెల్లంకొండ రాఘవను అదుపులోకి తీసుకుని, అతడి నుంచి 1.25 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. రెండు ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధురాలి అదృశ్యం

వృద్ధురాలి అదృశ్యంపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. పెదకూరపాడు మండలం లింగంగుంట్ల గ్రామానికి చెందిన మేదరమెట్ల నాగేంద్రమ్మ ఈ నెల 4న గుంటూరు గుజ్జనగుండ్ల సెంటర్ సమీపంలోని బంధువుల ఇంటికి వచ్చింది. మతిస్థిమితం లేని కారణంగా ఎవరికి చెప్పకుండా ఎటో వెళ్లి పోయింది.ఆమె ఆచూకీ కుటుంబ సభ్యులు వెతికినా ఫలితం లేకపోవడంతో ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఘనంగా ఎమ్మెల్సీ డొక్కా జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్

పట్నంబజారు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. కృష్ణనగర్‌లోని ఆయన కార్యాలయంలో పార్టీ నేతలు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తల నడుమ వేడుకల్ని ఘనంగా నిర్వహించారు. కార్యకర్తల కోలాహలం మధ్యన ఎమ్మెల్సీ డొక్కా కేక్‌ను కట్ చేశారు. ఆయన్ని దుశ్శాలువ, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్సీ డొక్కాకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన వారిలో పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్, మార్కెట్ యార్డు చైర్మన్ చంద్రగిరి ఏసురత్నం, సీఈసీ సభ్యుడు తాడిశెట్టి మురళీమోహన్, డెప్యూటీ మేయర్ షేక్ సజీల, పలు కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు, కార్పొరేటర్లు, నేతలు ఉన్నారు.

సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలి



మేయర్ మనోహర్ నాయుడుకు వినతి పత్రం సమర్పిస్తున్న అప్సా నాయకులు

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రైవేటు పాఠశాలల సమస్యల్ని పరిష్కారం దిశగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరుతూ నగర మేయర్ కావటి మనోహర్ నాయుడుకు ఏపీ ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్ ప్రతినిధులు వినతి పత్రం సమర్పించారు. ఆదివారం సంపత్‌నగర్‌లోని క్యాంపు కార్యాలయంలో మేయర్ మనోహర్ నాయుడును కలసిన అప్సా రాష్ట్ర కోశాధికారి మేకల రవీంద్రబాబు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా బడ్జెట్ పాఠశాలలు వివిధ రకాల సమస్యలతో తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయని తెలిపారు. ప్రైవేటు పాఠశాలల గుర్తింపు రెన్యూవల్ 10 ఏళ్లకు పెంచడంతో పాటు ఫైర్ ఎన్‌ఓసీ ఐదేళ్లకు ఒకసారి ఇవ్వాలని కోరారు. విద్యాహక్కు చట్టం కింద ప్రవేశాలను అమ్మఒడితో ముడిపెడుతూ విడుదల చేసిన జీవో 24ను ఉపసంహరించాలని పేర్కొన్నారు. దీనిపై స్పందించిన మేయర్ మనోహర్ నాయుడు మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలల సమస్యలపై విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఆయన్ను కలిసిన వారిలో అప్సా ప్రతినిధులు వెలిశెట్టి వెంకటేశ్వరరావు, బత్తిన వెంకట్రావు, జిల్లా ఉపాధ్యక్షులు, డివిజన్ నాయకులు మస్తాన్ కలాం, శ్రీనాథ్, ఆదిత్య ఉన్నారు.

ఖాతాదారుల ప్రయోజనాలకు పాటుపడాలి: మేయర్



సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ కావటి

కొరిటెపాడు (గుంటూరు): సహకార సొసైటీలు, సహకార బ్యాంకులు ఖాతాదారుల ప్రయోజనాల కోసం పాటుపడాలని గుంటూరు నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు సూచించారు. 110 సంవత్సరాల క్రితం దేశ గ్రామీణ, సాధారణ, మధ్యతరగతి ప్రజల ప్రయోజనార్థం ఏర్పడ్డ సహకార సంఘాలు, బ్యాంకులు దేశ ఆర్థిక అభివృద్ధిలో ప్రధాన భూమిక పోషించాయన్నారు. ఖాతాదారుల విస్తృత ప్రయోజనాల కోసం కృషి చేయడం ద్వారా అభివృద్ధి సాధించాలని సూచించారు. స్థానిక రాజాగారితోటలోని నందివెలుగు మ్యూచువల్లీ ఎయిడెడ్ కో–ఆపరేటివ్ థ్రిఫ్ట్ అండ్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్ మూడో వార్షికోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మనోహర్‌నాయుడు మాట్లాడుతూ అతి చిన్న వయస్సులోనే తన స్వగ్రామం పేరుతో కోటేశ్వరరావు కో–ఆపరేటివ్ సొసైటీ బ్యాంక్ ప్రారంభించి అనతి కాలంలోనే రూ.10 కోట్ల వ్యాపారంతో ఖాతాదారుల మన్ననలు అందుకోవడం అభినందనీయమన్నారు. క్రెడిట్ సొసైటీ చైర్మన్ తోట లక్ష్మీ కోటేశ్వరరావు మాట్లాడుతూ కేవలం మూడు సంవత్సరాల వ్యవధిలో రూ.10 కోట్ల వ్యాపారం చేయడంలో సహకరించిన డిపాజిట్‌దారులు, వ్యాపారస్తులకు కృతజ్ఞతలు తెలిపారు. తమ క్రెడిట్ సొసైటీ ద్వారా తక్కువ వడ్డీకే బంగారు ఆభరణాలపై రుణాలు, డిపాజిట్‌లపై ఇతర బ్యాంకుల కన్నా అత్యధిక వడ్డీ, సీనియర్ సిటిజన్స్, మహిళలు, వికలాంగుల డిపాజిట్లపై ఆరు సంవత్సరాలకే రెట్టింపు ఆదాయం పొందవచ్చని చెప్పారు. డిపాజిటర్లకు చెల్లించే వడ్డీపై ఎటువంటి పన్ను కోత ఉండదని స్పష్టం చేశారు. సీనియర్ సిటిజన్స్‌తో పాటు మహిళలకు సంవత్సరాలపు డిపాజిట్లపై 12 శాతం వడ్డీ అందిస్తున్నట్లు తెలిపారు. త్వరలో గుంటూరు, విజయవాడలలో నూతన శాఖలు ప్రారంభించబోతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్, మిర్యాల గోపీకుమార్, అఖిల భారత పంచాయతీ పరిషత్తు జాతీయ కార్యదర్శి డాక్టర్ జాస్తి వీరాంజనేయులు, సొసైటీ డైరెక్టర్లు, సిబ్బంది, పలువురు ఖాతాదారులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రీనివాసునికి గజ వాహన సేవ



గజ వాహనంపై స్వామి

పాత గుంటూరు: బృందావన్ గార్డెన్స్ శ్రీ కంచి కామకోటి పీఠ పద్మావతి గోదా సమేత వేంకటేశ్వర స్వామి దేవాలయంలో 24వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆదివారం ఆలయ ఉపాధ్యక్షుడు లంక విజయబాబు ఆధ్వర్యంలో బృందావన శ్రీనివాసుడిని విశేషంగా అలంకరించిన గజవాహనంపై తిరువీధులలో ఊరేగింపు నిర్వహించారు. శ్రీ దేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. బ్రహ్మోత్సవ ఉపన్యాస కార్యక్రమంలో తాళ్లాయపాలెం శైవక్షేత్రం శివస్వామి అనుగ్రహభాషణం చేశారు. తిరుప్పావై అమృతవర్షిణి కోగంటి వెంకట శ్రీ రంగనాయకి, ఎం.వి.సత్యవతి బ్రహ్మోత్సవాల వైశిష్ట్యాన్ని వివరించారు. కార్యక్రమానికి ఆలయ అధ్యక్షుడు సీహెచ్. మస్తానయ్య అధ్యక్షత వహించారు. బ్రహ్మశ్రీ నోరి నారాయణమూర్తి వ్యాఖ్యాతగా వ్యవహరించారు. కార్యక్రమంలో బొల్లేపల్లి సత్యనారాయణ, కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు, వూటుకూరి ఉమామహేశ్వరరావు, ఆవుల అచ్యుత రామయ్య, సూర్యదేవర వెంకటేశ్వర్లు, కోశాధికారి లంకా సూర్యనారాయణ, భక్తులు పాల్గొన్నారు.

సందడిగా విజ్‌డమ్ స్కూలు వార్షికోత్సవం



పాత గుంటూరు: రాజాగారి తోటలోని వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఆదివారం విజ్‌డమ్ స్కూలు 40వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే మద్దాలి గిరిధర్‌రావు, నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనంతరం ముఖ్య అతిథులు విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందించారు. కార్యక్రమంలో మాస్టర్ మైండ్స్ అధినేత మోహన్, విజ్‌డమ్ స్కూలు ప్రిన్సిపాల్ సగుటూరు శారద, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని స్కూల్ డైరెక్టర్ సగుటూరు రమణ రవిబాబు పర్యవేక్షించారు.

పేద విద్యార్థుల ఉన్నతికి జాష్టి వెంకటేశ్వర్లు కృషి



సంతాప సభలో బసవపున్నయ్య, గోపాలకృష్ణ, కృష్ణప్రసాద్, కోటేశ్వరరావు, గోవర్ధనరావు

గుంటూరు ఎడ్యుకేషన్: పేద విద్యార్థుల విద్యాభ్యున్నతి కోసం ఏటా ఉపకార వేతనాలను మంజూరు చేసే కార్యక్రమాన్ని చేపట్టిన జాష్టి వెంకటేశ్వర్లు చిరస్మరణీయుడని శ్రీ కాకతీయ స్టూడెంట్ వెల్ఫేర్ సొసైటీ చైర్మన్ డాక్టర్ కె.బసవపున్నయ్య పేర్కొన్నారు. జేకేసీ కళాశాల రోడ్డులోని డాక్టర్ కేఎల్‌పీ పబ్లిక్ స్కూల్లో ఆదివారం ఇటీవల అమెరికాలో మరణించిన శ్రీకాకతీయ స్టూడెంట్ వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపకుడు డాక్టర్ జాష్టి వెంకటేశ్వర్లు సంతాప సభ నిర్వహించారు. అధ్యక్షత వహించిన బసవపున్నయ్య మాట్లాడుతూ జాష్టి వెంకటేశ్వర్లు జీవనంతో పాటు విద్యార్థుల శ్రేయస్సు కోసం ఆయన స్థాపించిన కాకతీయ సొసైటీ ప్రస్థానాన్నివివరించారు. గత 18 ఏళ్లుగా సొసైటీ ద్వారా ప్రతిభావంతులైన పేద విద్యార్థుల ఉన్నత చదువులకు ఏటా రూ.25 లక్షల నుంచి రూ.40 లక్షల వరకు ఉపకార వేతనాల రూపంలో ఇస్తున్నట్లు తెలిపారు. డాక్టర్ మద్దినేని గోపాలకృష్ణ, నామినేని కోటేశ్వరరావు మాట్లాడుతూ ఏసీ, జేకేసీ కళాశాలల్లో అధ్యాపకుడి నుంచి అమెరికాలో స్థిరపడి అక్కడి ప్రవాసాంధ్రుల ద్వారా విరాళాల్ని సేకరించిన విధానాన్ని ప్రశంసించారు. పేద విద్యార్థుల సంక్షేమం కోసం కాకతీయ సొసైటీ స్థాపనలో విశేష కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో గద్దె మంగయ్య, సొసైటీ కార్యదర్శి డాక్టర్ కె.కృష్ణప్రసాద్, కేఎల్‌పీ స్కూల్ ప్రిన్సిపాల్ వై. రధినీచౌదరి, కాకతీయ సొసైటీ సభ్యులు గోవర్ధనరావు, జేకేసీ కళాశాల కార్యవర్గం, అధ్యాపకులు పాల్గొని వెంకటేశ్వర్లుకు నివాళులర్పించారు.

చదువుతో పాటు క్రీడలు ఎంతో అవసరం



క్రీడా పోటీల విజేతలతో వేంకటేశ్వరరావు, పద్మావతి

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థుల సమగ్రాభివృద్ధికి చదువుతో పాటు క్రీడలు ఎంతో అవసరమని ప్రముఖ యోగా శిక్షకుడు గోపవరపు వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. పట్టాభిపురంలోని శ్రీపూజిత పబ్లిక్ స్కూల్లో వార్షిక క్రీడా దినోత్సవ సందర్భంగా మూడు రోజుల పాటు నిర్వహించిన వివిధ పోటీల్లో ప్రతిభను ప్రదర్శించిన విద్యార్థులకు ఆదివారం బహుమతులు అందజేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న వెంకటేశ్వరరావు మాట్లాడుతూ క్రీడా మైదానాలు లేకుండా పాఠశాలలు కొనసాగుతున్న ప్రస్తుత తరుణంలో పెద్ద మైదానం కలిగిన ఉండటం అభినందనీయమన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ కంచర్ల పద్మావతి మాట్లాడుతూ మూడు రోజుల పాటు నిర్వహించిన వాలీబాల్, కబడ్డీ, ఖో–ఖో, త్రోబాల్, లాంగ్ జంప్, షాట్‌పుట్, డాడ్జిబాల్ తదితర క్రీడాంశాల్లో విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చారని చెప్పారు. కార్యక్రమంలో క్రీడా శిక్షకులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రాష్ట్రానికి బ్రాండ్ అంబాసిడర్ సీఎం జగన్



సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే గిరి, ఏసురత్నం, సజీల

పట్నంబజారు: ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డిని బ్రాండ్ అంబాసిడర్‌గా భావించి ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టేందుకు దేశంలోనే అత్యంత సంపన్నులైన పారిశ్రామికవేత్తలు ముందుకు రావడం సువర్ణాధ్యాయమని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ చెప్పారు. గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ విజయవంతం అయిన నేపథ్యంలో ఆదివారం స్తంభాలగరువులోని మహానేత వై.ఎస్. రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించి, కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గిరి మాట్లాడుతూ సీఎంగా వై.ఎస్. జగన్ పగ్గాలు చేపట్టిన నాటి నుంచి రాష్ట్రంలో జరిగిన అభివృద్ధిని చూసి పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు ముందుకు వచ్చారని తెలిపారు. రూ 13లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు రావడం ద్వారా రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. ప్రతిపక్షాలు, కొన్ని పత్రికలు, మీడియా చానల్స్ రాష్ట్రంలో ఏదో జరిగిపోతుందని, మరో శ్రీలంక, బిహార్ అయిపోతోందని విమర్శలు చేసిన వారికి గ్లోబల్ ఇన్వెస్టర్ సమ్మిట్ ఒక చెంపపెట్టు లాంటిందని తెలిపారు. టీడీపీ అధినేత చంద్రబాబు నుంచి ఏ ఒక్కరూ నోరు కూడా మెదపలేని విధంగా రాష్ట్రానికి పెట్టుబడులు వచ్చాయన్నారు. గతంలో చంద్రబాబు రాష్ట్రానికి తీసుకునివచ్చిన పెట్టుబడులన్నీ కేవలం కాగితాలకే పరిమితమైయ్యాయని విమర్శించారు. సీఎం జగన్ పారిశ్రామికవేత్తలనే తీసుకునివచ్చి పరిపాలన విధానం, రాష్ట్రాన్ని మరింత ముందుకు ఎలా తీసుకుని వెళ్లవచ్చో చేసి చూపించారని తెలిపారు. మిర్చి యార్డు చైర్మన్ చంద్రగిరి ఏసురత్నం మాట్లాడుతూ రాష్ట్రానికి పరిశ్రమలు రావడం ద్వారా లక్షలాది మందికి ఉద్యోగాలతో పాటు ఉపాధి కలుగుతుందని చెప్పారు. ప్రపంచ దిగ్గిజ వ్యాపారులైన ముఖేష్ అంబాని, కరుణ్ అదాని, జిందాల్, కియా మోటార్ ప్రతినిధులు వంటి వారిని ఏపీకి తీసుకువచ్చిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందని తెలిపారు. చంద్రబాబు సైతం పరిశ్రమలు తీసుకునివచ్చేందుకు విదేశాలకు వెళ్లారని, అయితే అక్కడ జల్సాలు చేశారే తప్పా రాష్ట్రం గురించి ఆలోచించిన పాపాన పోలేదని విమర్శించారు. భవిష్యత్తులో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి మరింత మెరుగు పడుతుందని పేర్కొన్నారు. డెప్యూటీ మేయర్ షేక్ సజీల మాట్లాడుతూ వందలాది మంది పారిశ్రామికవేత్తలు పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావటమనేది.. సీఎం జగన్ పరిపాలన, సంక్షేమం, అభివృద్ధిని చూసి మాత్రమేనని తెలిపారు. కార్యక్రమంలో పలు కార్పొరేషన్ల చైర్మన్లు డైరెక్టర్లు, కార్పొరేటర్లు, వైఎస్సార్ సీపీ నేతలు షేక్ ముంతాజ్, గనిక ఝాన్సీ, బూసి రాజలత, అడకా పద్మావతి, బుజ్జి, టీఎల్‌పీ ఆంజనేయులు, ఆనం సంజీవరెడ్డి, సైదాఖాన్, నరసింహారావు, కృష్ణ, యోగేశ్వరరావు, ఇన్నారెడ్డి, ప్రభు, సాంబశివరావు పాల్గొన్నారు.

విదేశీ యూనివర్సిటీలతో దేశీయ విద్యకు విఘాతం



సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణ

పాత గుంటూరు: యూజీసీ ముసాయిదా పేరుతో కేంద్ర ప్రభుత్వం తీసుకు వస్తున్న విదేశీ యూనివర్సిటీలతో స్వదేశీ యూనివర్సిటీలు దెబ్బతింటాయని పీడీఎస్‌యూ జాతీయ కన్వీనర్ ఎం. రామకృష్ణ పేర్కొన్నారు. అరండల్‌పేటలోని కామ్రేడ్ మాదాల నారాయణస్వామి భవనంలో ఆదివారం ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం(పీడీఎస్‌యూ) రాష్ట్రస్థాయి సమావేశం నిర్వహించారు. సభకు రాష్ట్ర అధ్యక్షుడు యు. గనిరాజు అధ్యక్షత వహించారు. ముఖ్య వక్తగా పాల్గొన్న ఎం. రామకృష్ణ మాట్లాడుతూ దేశంలోని యూనివర్సిటీలు సమస్యలతో సంక్షోభంలో కూరుకుపోయాయని తెలిపారు. దేశవ్యాప్తంగా 800 వరకు ఉన్న యూనివర్సిటీల్లో వేలాది ప్రొఫెసర్ పోస్టులు, నాన్ టీచింగ్ సిబ్బంది కొరత ఉందని చెప్పారు. హాస్టళ్లలో అనేక సమస్యలతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. విదేశీ యూనివర్సిటీలను ప్రతిఒక్కరూ ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీఎస్. సాగర్, రాష్ట్ర కార్యదర్శి ఎల్. రాజశేఖర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం. వినోద్ కుమార్, కిరణ్ కుమార్, ఎం. సునీల్ పాల్గొన్నారు.